వైకుంఠధామం పనుల్లో జాప్యం

- నిధులు మంజూరైనా ముందుకు సాగని పనులు
- అసంపూర్తిగా స్నానాల గదులు
- అవస్థ పడుతున్న జనం


బోరబండ బలహీనవర్గాల కాలనీలోని వైకుంఠధామం


అసంపూర్తిగా ఉన్న స్నానాల గదులు, దహనవాటికల నిర్మాణం

బోరబండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బోరబండ డివిజన్ బలహీనవర్గాల కాలనీ వైకుంఠధామంలో కనీస వసతులు కరువయ్యాయి. దీనివల్ల అంత్యక్రియల కోసం వచ్చే వారు నానా అవస్థలు పడుతున్నారు. బోరబండ, రహ్మత్‌నగర్ డివిజన్ల పరిధిలోని 50కి పైగా బస్తీలకు సంబంధించిన ఈ మరుభూమిలో కొన్ని దశాబ్దాలుగా హిందువులు, క్రైస్తవుల అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. ఐదెకరాల్లో విస్తరించి ఉన్న ఈ శ్మశానవాటికలో కొందరు ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండడం వల్ల ఇతరులు అవస్థ పడుతున్నారు. శ్మశానవాటిక ప్రహరీ పలుచోట్ల కూలిపోవడంతో రాత్రి వేళల్లో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో లారీ ఢీకొని ఉత్తరం వైపు గోడ కూలింది. కాగా, సమీపంలోని సున్నంచెరువులోని పూడికను తొలగించి వాహనాల్లో వైకుంఠదామం ప్రహరీని ఆనుకుని పెద్దఎత్తున తరలిస్తున్నారు. దీనివల్ల తూర్పు వైపున ఉన్న ప్రహరీ కూలిపోయింది. దీనివల్ల శ్మశానంలోకి సులభంగా ప్రవేశించే అవకాశం కలిగింది.

చేపట్టాల్సిన పనులు

బోరబండ శ్మశానవాటిక ఆవరణలో తిరిగేందుకు బాట నిర్మాణం, స్నానాల గదులు, కర్మకాండలు నిర్వహించేందుకు హాల్, పిండ ప్రదాన ప్రాంతం, అస్తికలు భద్రపరిచే హాల్, ఒకేసారి మూడు మృతదేహాలకు అంత్యక్రియలు చేసేలా దహన వాటికలు, మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉంది. వైకుంఠదామంలోకి ప్రవేశించేందుకు ప్రస్తుతం ఒకటే మార్గం ఉండగా, మరొక మార్గాన్ని ఏర్పాటు చేస్తామన్న అధికారులు ఆ మాటే మరిచినట్లున్నారు.

రూ.1.75 కోట్లు మంజూరు

శ్మశానవాటికలో కనీస వసతులు కల్పించడం లేదని పీజేఆర్ ఎస్పీఆర్ హిల్స్ ఉమ్మడి బస్తీల ఐక్యత సంక్షేమ సంఘం కమిటీ గతంలో లోక్ అధాలత్‌ను ఆశ్రయించి పలుమార్లు చేసిన విజ్ఞప్తి మేరకు అధికారులు రూ.1.75 కోట్లు మంజూరు చేశారు. దాదాపు నాలుగేళ్ల క్రితం నిధులు మంజూరైనా వివిధ కారణాల వల్ల పనులు మాత్రం ప్రారంభం కాలేదు. గ్రేటర్ పరిధిలోని దాదాపు అన్ని వైకుంఠదామాల్లో అభివృద్ధి పనులు పూర్తయినా, బోరబండలో మాత్రం పనులు కొనసాగు..తూనే ఉన్నాయి. అభివృద్ధి పనులు చేపట్టేందుకు ముందుకు వచ్చిన కాంట్రాక్టర్లు స్థానిక రాజకీయాల కారణంగా పనులను మధ్యలోనే నిలిపేశారు. ఆ తర్వాత పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లులు అందని కారణంగా పనులు నత్తనడకన సాగుతున్నాయి ఏళ్లు గడుస్తున్నా ఇక్కడ పనులు మాత్రం పూర్తి కావడం లేదు.

నిరుపయోగంగా గ్యాస్ ఆధారిత దహన వాటిక

వైకుంఠధామంలో రూ.12 లక్షలతో గ్యాస్ ఆధారిత దహనవాటికను కొన్నేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. ఇందులో అంత్యక్రియలు చేసేందుకు ఎవరూ ఆసక్తి చూపనందున అది నిరుపయోగంగా మారింది. సరైన గస్తీ లేనందున దహన వాటికలోని విలువైన పరికరాలు చోరీకి గురయ్యాయి. బోరబండ పోలీసులు దీనిపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు.


హైడ్రా ఆధ్వర్యంలో సున్నంచెరువు పూడికను తీసి వాహనాల్లో తరలించడం వల్ల కూలిన వైకుంఠధామం ప్రహరీ


నిరుపయోగంగా ఉన్న గ్యాస్ ఆధారిత దహన వాటిక

ఏళ్లు గడుస్తున్నా పనులు జరగడం లేదు



బోరబండ బొందలగడ్డలో ఏళ్లు గడుస్తున్నా పనులు మాత్రం పూర్తవడం లేదు. లోక్ అదాలత్‌ను ఆశ్రయించి రూ.1.75 కోట్ల నిధులు కేటాయించేలా చేసినప్పటికీ, అధికారుల అలసత్వం, గుత్తేదారుల నిర్లక్ష్యంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు త్వరగా పూర్తి చేస్తే అందరికీ సదుపాయంగా ఉంటుంది.

● వేముల యాదయ్య, పీజేఆర్, ఎస్పీఆర్ హిల్స్ ఉమ్మడి బస్తీల ఐక్యత సంక్షేమ సంఘం అధ్యక్షుడు

హనుమాన్ ఆలయంలో కార్పొరేటర్ పూజలు


హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న కార్పొరేటర్ కొలను లక్ష్మి

బేగంపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మి పుట్టిన రోజు వేడుకలు శుక్రవారం కార్యకర్తల సమక్షంలో ఘనంగా జరిగాయి. హనుమాన్ ఆలయంలో కార్పొరేటర్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తున్నానని పేర్కొన్నారు. తనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం ప్రజావాణికి 187 దరఖాస్తులు


దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న చిన్నారెడ్డి, దివ్య

బేగంపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మహాత్మాజ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 187 దరఖాస్తులు వచ్చాయి. సింగరేణిలో కారుణ్య నియామకాలు చేపట్టాలని నిరుద్యోగ యువకులు సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి, రాష్ట్ర నోడల్ అధికారి దివ్యను కోరారు. సంబంధిత అధికారులతో వారు ఫోన్‌లో మాట్లాడి త్వరలో నియామక ప్రక్రియ మొదలు పెట్టాలని సూచించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 28, రెవెన్యూ 35, ఇందిరమ్మ ఇళ్ల కోసం 47, మున్సిపల్ 10, విద్యుత్ 17, హోం శాఖకు 10 దరఖాస్తులతోపాటు ఇతర శాఖలకు 33 దరఖాస్తులు వచ్చినట్లు దివ్య తెలిపారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

పంజాగుట్ట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో అపోలో ఆస్పత్రి సహకారంతో ఈ నెల 8న సమితి కార్యాలయం ఆవరణలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని సమితి అధ్యక్షుడు చిలకల వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ శిబిరంలో కొలెస్ట్రాల్, బీపీ, మధుమేహం, కంటి, దంత తదితర వైద్య పరీక్షలు నిర్వహిస్తారని ఆయన తెలిపారు. కాలనీవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఖైరతాబాద్‌కు 3వ స్థానం


బహుమతి పొందిన వారితో అధికారులు

ఖైరతాబాద్ జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఖైరతాబాద్ బ్రైట్ వెల్ఫేర్ అసోసియేషన్ మైదానం విద్యార్థులకు 3వ బహుమతి వచ్చింది. ఇక్కడ కరాటే, వాలీబాల్ క్రీడల్లో శిక్షణ ఇచ్చారు. శుక్రవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో పరేడ్‌తో పాటు క్రీడల్లో ప్రతిభ చూపి ఓవరాల్‌గా గ్రేటర్‌లో 3వ బహుమతి పొందారు. కోచ్‌లతో పాటు నిర్వాహక బృందానికి జీహెచ్ఎంసీ క్రీడా విభాగం జాయింట్ డైరెక్టర్ యాదగిరిరెడ్డి, అదనపు డైరెక్టర్ రహీనాబేగం, ఇన్‌స్పెక్టర్ మాధవి బహుమతి అందజేశారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు రాజ్‌భవన్ విద్యార్థులు ఎంపిక


స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బేగంపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రతీ సంవత్సరం నిర్వహించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్)కు రాజ్‌భవన్ స్కూల్ నుంచి 16 మంది విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ఎన్ఎంఎంఎస్ ఇన్‌చార్జి ఎస్.సురేందర్ తెలిపారు. ప్రతి సంవత్సరం తమ పాఠశాల నుంచి పలువురు విద్యార్థులు ఈ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికవుతున్నారని ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం వికారుద్దీన్, ఇన్‌చార్జి హెచ్‌ఎం గోపాల్, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు.

బోరబండ ప్రభుత్వ కళాశాలకు సొంత భవనం నిర్మించాలి

బోరబండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బోరబండ బలహీన వర్గాల కాలనీలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సొంత భవనం నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జూబ్లీహిల్స్ కార్యదర్శి సునీల్ పవార్ డిమాండ్ చేశారు. 2016-17లో జూనియర్ కళాశాలను ప్రారంభించారని, కనీసవసతులు కల్పించడంలో ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు విఫలమవుతున్నారని ఆయన ఆరోపించారు.

వాస్కోడిగామా రైల్లో ఎస్‌టీఎఫ్ పోలీసుల దాడులు

- 48 బాటిళ్ల అక్రమ మద్యం సీజ్


నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను పట్టుకున్న ఎస్‌టీఎఫ్ టీమ్, స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

హైదరాబాద్ సిటీ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా నగరానికి దిగుమతి అవుతున్న అక్రమ, నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను అరికట్టే దిశగా ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ పోలీసులు దాడులు ముమ్మరం చేశారు. శుక్రవారం వాస్కోడిగామా రైల్లో దాడులు నిర్వహించిన ఎస్‌టీఎఫ్ డీ టీమ్ 48 బాటిళ్ల నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను సీజ్ చేశారు. గోవా నుంచి వచ్చే వాస్కోడిగామా రైల్లో అక్రమ మద్యం సరఫరా అవుతుందన్న విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్‌టీఎఫ్ టీమ్ షాద్‌నగర్‌లో రైలెక్కి కాచిగూడ వరకు తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో 48 అక్రమ మద్యం బాటిళ్లు పట్టుకున్నారు. అయితే సీజ్ చేస్తున్న క్రమంలో నిందితులెవరూ పట్టుబడలేదని పోలీసులు తెలిపారు. ఈ దాడిలో ఎస్‌టీఎఫ్ సీఐలు బిక్ష రెడ్డి, వెంకటేశ్వర్లు, నాగరాజుతో పాటు సికింద్రాబాద్ డీటీఎఫ్ సీఐ 35 మంది సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌టీఎఫ్ టీమ్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్‌ఖాసీం అభినందించారు.

విద్యార్థుల్లో అసాధారణ ప్రతిభ

- లీడ్ గ్రూప్ సీఈఓ సహ వ్యవస్థాపకుడు సుమీత్ మెహతా


బహుమతులు పొందిన విద్యార్థులతో సుమీత్ మెహతా

హైదరాబాద్ సిటీ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లోని చిన్న పట్టణాలు, నగరాల్లోని విద్యార్థుల్లో అసాధారణమైన ప్రతిభ దాగి ఉందని లీడ్ గ్రూప్ సీఈఓ సహ వ్యవస్థాపకుడు సుమీత్ మెహతా అన్నారు. యంగ్ లీడర్స్ ప్రోగ్రాం(వైఎల్‌పీ) యువ విద్యార్థులకు నిజమైన సమస్యలను పరిష్కరించేందుకు ఒక వేదిక అన్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం లీడ్ సంస్థ నిర్వహించిన యంగ్ లీడర్స్ ముగింపు కార్యక్రమంలో 14 రాష్ట్రాల నుంచి 53 మంది 7వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. విజేతగా 'విజ్ టైటాన్స్' బృందం నిలవగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సుమీత్ మెహతా మాట్లాడుతూ దేశంలోని విద్యారంగంలో ఉన్న వాస్తవ ప్రపంచ సవాళ్లకు పరిష్కారాలను అభివృద్ధి చేసేందుకు వివిధ ప్రాంతాలను అనుసంధానం చేసేందుకు యంగ్ లీడర్స్ కార్యక్రమం అవకాశం కల్పిస్తుందన్నారు. వ్యాపార, విద్యారంగంలోని వాస్తవ ప్రపంచ సవాళ్ల పరిష్కారానికి ప్రాజెక్టులు రూపొందించడానికి పరిశ్రమ నిపుణులు మార్గనిర్దేశం చేశారన్నారు. 21వ శతాబ్దానికి అవసరమైన నైపుణ్యాలను-విమర్శనాత్మక ఆలోచన, సహకారం, కమ్యూనికేషన్, సృజనాత్మకతను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. లీడ్ గ్రూప్ కో సీఈఓ, సహ వ్యవస్థాపకురాలు స్మితా దేవ్‌రా మాట్లాడుతూ విద్యార్థులు తమ ఆలోచనలను పరీక్షించుకోవడానికి, నిజమైన సవాళ్ల నుంచి నేర్చుకోవడానికి అనుకూలమైన వాతావరణం సృష్టించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలు కల్పించాలి

- కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్


మాట్లాడుతున్న కార్పొరేటర్ వెంకటేష్

బంజారాహిల్స్/యూసుఫ్‌గూడ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ అన్నారు. ఫిలింనగర్ రౌండ్ టేబుల్ పాఠశాలలో శుక్రవారం జరిగిన బడిబాటలో ఆయన మాట్లాడారు. చదువుకు దూరమైన పిల్లలను తిరిగి పాఠశాలలో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర నాయకులు నడిమింటి కృష్ణ, జెజోల రాజు, శ్రీశైలం, హసన్ అలీ, కట్ట లక్ష్మయ్య, శ్రీహరి పాల్గొన్నారు. యూసుఫ్‌గూడ బస్తీల్లో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ప్రచారం చేశారు. పిల్లలను పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి నరసింహ, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం శ్రీదేవి, ఎస్ఎల్ఎఫ్ చైర్మన్ అమ్మాజీ, నాగరాజు, మాలతి పాల్గొన్నారు.

మా తప్పులను క్షమించి ఉద్యోగాల్లోకి తీసుకోండి


సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్

పంజాగుట్ట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఎస్ఆర్టీసీ)లో పనిచేస్తూ వివిధ కారణాలతో తొలగింపబడిన, సస్పెండ్ అయిన ఉద్యోగులను వెంటనే ఉద్యోగాల్లోకి తీసుకోవాలని, ప్రభుత్వం ఇచ్చిన జీవోను వెంటనే అమలు చేయాలని సస్పెండ్, తొలగింపబడిన ఉద్యోగులు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవోను అమలు చేయాలని కోరుతూ శుక్రవారం సస్పెండ్, తొలగింపబడిన ఉద్యోగులు బస్‌భవన్‌లో ఆర్టీసీ ఎండీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సస్పెండ్ అయిన, తొలగింపబడిన ఉద్యోగులు దగ్గు రాజేందర్, సుంకరి భాగేశ్వర్, కుమ్మరి గంగాధర్, నగేష్, కె.ప్రేమ్‌సింగ్, పి.రజని, సమీనా బేగం తదితరులు మాట్లాడారు. తమ తప్పులను క్షమించి సస్పెండ్, తొలగింపబడిన ఉద్యోగులను అందరినీ విధుల్లోకి తీసుకోవాలని కోరారు. గడిచిన కొన్ని రోజులుగా సీఎంకు, రవాణాశాఖ మంత్రికి, ప్రజావాణిలో ఇన్‌చార్జి చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్యకు వినతిపత్రం ఇచ్చి ప్రాధేయపడ్డామని తెలిపారు. గత సంవత్సరం డిసెంబరు 11న త్రీమెన్ కమిటీని, సబ్ కమిటీని వేసిందని అన్నారు. అయా కమిటీలు గత నెల తమ ట్రాక్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారని తెలిపారు. ఎట్టకేలకు గత నెల 28న సస్పెండ్, తొలగింపబడిన ఉద్యోగులు అందరినీ విధుల్లోకి తీసుకోవాలని రవాణా, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ సంబంధిత అధికారులను ఆదేశిస్తూ జీవో జారీ చేశారని తెలిపారు. ఆ జీవో ప్రకారం తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఇప్పటికే 16 మంది అనారోగ్యం, మనోవేదనతో మృతిచెందారని, కొంతమంది ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. ఆర్టీసీ యాజమాన్యం ప్రభుత్వం విడుదల చేసిన జీవోను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పాండు యాదవ్, ప్రసాద్‌రావు, రమేష్ యాదవ్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేసిన ఆలయ కమిటీ సభ్యులు

బంజారాహిల్స్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): శ్రీనగర్‌కాలనీ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ నూతన కమిటీని దేవాదాయ శాఖ ప్రకటించిన నేపథ్యంలో కమిటీ సభ్యులు శుక్రవారం స్వామివారి సన్నిధిలో ప్రమాణ స్వీకారం చేశారు. 15 మంది సభ్యులతో కూడిన కమిటీని దేవాదాయ శాఖ ప్రకటించినట్లు ఆలయ ఈవో శ్రీనివాసశర్మ తెలిపారు. సభ్యులతో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ మధు ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కమిటీ సభ్యులుగా సోదర్ ఎస్.దినేష్ కుమార్, నలమాద సుదర్శన్‌రెడ్డి, నందిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, సాయిప్రసాద్ కోనేరు, తుమ్మల గీతాచౌదరి, ఉన్నం సుబ్బారావు, గొంటి నర్సింగ్ యాదవ్, గొట్టిపర్తి శరత్‌బాబు, అర్జున్ యాదవ్, కళ్యాణి, కటకం రాజేష్, జగదీష్, మోట విజయకుమార్, కె.లక్ష్మణ్, ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా ఆలయ ప్రధాన అర్చకులు మురళీధరశర్మ నియమితులయ్యారు. త్వరలోనే అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పూర్తిస్థాయి కమిటీని ఏర్పాటు చేసుకుంటామని ఈ సందర్భంగా కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ అజారుద్దీన్ తనయుడు, కాంగ్రెస్ నేత అసదుద్దీన్ తదితరులు పాల్గొని నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.

మనీ ల్యాండరింగ్ కేసులో..

డిజిటల్ అరెస్ట్ చేస్తామని సైబర్ మోసం

- వృద్ధుడిని బెదిరించి రూ. 1.40 లక్షలు కొట్టేసిన క్రిమినల్స్

హైదరాబాద్ సిటీ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మనీ ల్యాండరింగ్ కేసులో డిజిటల్ అరెస్టు చేస్తామని వృద్ధుడిని భయపెట్టిన సైబర్ క్రిమినల్స్ రూ.1.40 లక్షలు కొల్లగొట్టారు. మోసపోయినట్లు ఆలస్యంగా గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డీసీపీ ధార కవిత తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి(57)కి మే 12న ఒక గుర్తు తెలియని వ్యక్తి వాట్సాప్ కాల్ చేశాడు. మీ ఆధార్‌కార్డు వినియోగించి బెంగళూరులో బ్యాంక్ ఖాతా తెరిచారు. ఆ ఖాతా ద్వారా రూ. కోట్లలో మనీల్యాండరింగ్ జరిగినట్లు సీబీఐ క్రిమినల్ కేసులు నమోదు చేసిందని చెప్పాడు. ఇదిగో మా సీబీఐ ఉన్నతాధికారి మాట్లాడుతారు అంటూ వీడియోకాల్ చేసి ఇచ్చారు. పోలీస్ యూనిఫామ్‌లో ఉన్న అవతలి వ్యక్తి బాధితుడితో మాట్లాడారు. అతడిపై నమోదైన మనీ ల్యాండరింగ్ కేసు గురించి ప్రస్తావించారు. తనకు ఏమీ తెలియదని, అసలు బెంగళూరులో బ్యాంక్ అకౌంట్ లేదని చెప్పినా వారు వినిపించుకోలేదు. మీతో పాటు.. మీ భార్య ఖాతాలకు చెందిన బ్యాంక్ బ్యాలెన్స్‌లు ఆర్బీఐకి చెందిన ఖాతాకు బదిలీ చేయాలని ఆడిట్ చేసిన తర్వాత మీ ఖాతాల్లో ఎలాంటి మనీ ల్యాండరింగ్ జరగలేదని తేలితే మీ డబ్బు వాపస్ చేస్తామని నమ్మించారు. లేదంటే డిజిటల్ అరెస్టు చేస్తామని, మా సిబ్బంది వెంటనే మిమ్మల్ని అదుపులోకి తీసుకొని జైలుకు తరలిస్తారని బెదిరించారు. మీ ఖాతాల ఆడిట్ తేలే వరకు ఈ విషయాలు ఎవరికీ చెప్పొద్దని భయపెట్టారు. దాంతో వారి మాటలు నిజమని నమ్మిన బాధితుడు వారు చెప్పిన ఖాతాలో రూ. 1.40 లక్షలు డిపాజిట్ చేశాడు. ఎంతకీ డబ్బులు డిపాజిట్ చేయకపోవడం, ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎవరూ స్పందించకపోవడంతో అనుమానం వచ్చిన బాధితుడు ఆరా తీయగా.. అదంతా సైబర్ మోసమని తెలిసింది. బాధితుడి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

స్పా ముసుగులో వ్యభిచారం

- ఫోన్ చేస్తే లొకేషన్ పంపుతారు
- పరారీలో నిర్వాహకులు.. ఐదుగురు కస్టమర్లు అరెస్ట్

హైదరాబాద్ సిటీ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): స్పా ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న మహిళతోపాటు ఐదుగురు కస్టమర్లను అరెస్ట్ చేసిన పోలీసులు ఓ మహిళను కాపాడారు. లింగంపల్లి శివనందిని అలియాస్ అంజలి, మద్దినేని సందీప్ కలిసి అమీర్‌పేట గురుద్వారా సమీపంలో "ఎన్ఎస్ బ్యూటీ సెలూన్ అండ్ స్పా" ఏర్పాటు చేశారు. వీరిద్దరూ నగరంలోని వివిధ ప్రాంతాల్లో యువతులకు డబ్బు ఇచ్చి వారితో వ్యభిచారం చేయిస్తున్నారు. ఆదిలాబాద్ ఉట్నూర్ ప్రాంతానికి చెందిన నతారి సుధ(30) బాలానగర్‌లో ఉంటూ వీరు నిర్వహిస్తున్న స్పాలో పనిచేస్తుంది. అంజలి, సందీప్ ఈమెకు నెలకు రూ. 25 వేల జీతం ఇచ్చి స్పాలో వసూళ్లు చేసేందుకు నియమించారు. అమ్మాయిలు కావాలని శివనందిని, సందీప్‌ను సంప్రదించిన కస్టమర్లకు సుధ ఫోన్ నెంబర్ ఇస్తారు. సుధ తనను సంప్రదించిన కస్టమర్లకు స్పా లొకేషన్ పంపుతుంది. వచ్చిన వారి నుంచి రూ.1,500 నుంచి రూ.2వేల వరకు వసూలు చేస్తూ, మహిళలతో ఏకాంతంగా గడిపేందుకు సమయం కేటాయిస్తోంది. స్పా ముసుగులో జరుగుతున్న వ్యభిచారంపై పక్కా సమాచారమందుకున్న వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్, ఎస్ఆర్‌నగర్ పోలీసులు కలిసి స్పా సెంటర్‌పై దాడి చేశారు. స్పాను నిర్వహిస్తున్న సుధతోపాటు సగిరాజు దినేష్‌వర్మ, గుడల గౌతమ్, నేనావత్ రవికుమార్, చవన్ సురేందర్, పిన్ని ప్రవీణ్‌కుమార్‌ను అరెస్ట్ చేసి మహిళను కాపాడారు. స్పా నిర్వహిస్తున్న ప్రధాన నిందితులు శివనందిని, సందీప్ పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

యూసుఫ్‌గూడ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మానసిక ఒత్తిడితో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళంకు చెందిన కవి అనిల్ కుమార్(27) బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో పని చేస్తున్నాడు. కొన్ని రోజులుగా మానసిక ఒత్తికి లోనయ్యాడు. విషపూరితమైన క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబసభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతదేహాన్ని పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలించారు.

బాలిక అదృశ్యం

యూసుఫ్‌గూడ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): అన్నతో మార్కెట్‌కు వెళ్లిన బాలిక అదృశ్యమైంది. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన ఓ కుటుంబం జవహర్‌నగర్‌లో ఉంటున్నారు. అన్నా, చెల్లి మార్కెట్‌కు వెళ్లారు. తిరిగి వచ్చే క్రమంలో బాలిక ఇంటికి రాలేదు. దీంతో తల్లి రమాదేవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలి

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించిన సీఆర్‌పీఎఫ్ ప్రతినిధులు

అడ్డగుట్ట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలని కోరుతూ బాలల హక్కుల పరిరక్షణ వేదిక (సీఆర్‌పీఎఫ్) రాష్ట్ర కన్వీనర్ జి.భాగ్యలక్ష్మి, జిల్లా కార్యదర్శి సీహెచ్ లక్ష్మీనారాయణ, మండల కన్వీనర్ ప్రవీణ్ కుమార్, నక్కల శోభ శుక్రవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ నివాసంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, యూనిఫాంలు అమ్మడాన్ని నిషేధించాలని, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ఏ విద్యా హక్కుల చట్టం ప్రకారం ప్రైవేట్ స్కూళ్లల్లో 25 శాతం వెనుకబడిన వర్గాలకు సీట్లు కేటాయించాలని ఎమ్మెల్యేను కోరామన్నారు.



సీఎం ప్రజావాణిలో దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న చిన్నారెడ్డి, దివ్య

సీఎం ప్రజావాణికి 187 దరఖాస్తులు

బేగంపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 187 దరఖాస్తులు వచ్చాయి. సింగరేణిలో కారుణ్య నియామకాలు చేపట్టాలని, అందుకు చొరవ చూపాలని నిరుద్యోగ యువకులు సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్యను కోరగా, అధికారులతో వారు ఫోన్‌లో మాట్లాడి త్వరలో నియామక ప్రక్రియ మొదలు పెట్టాలని సూచించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 28, రెవెన్యూకు 35, ఇందిరమ్మ ఇండ్ల కోసం 47, మున్సిపల్‌కు 10, విద్యుత్‌కు 17, హోం శాఖకు 10 దరఖాస్తులతో పాటు ఇతర శాఖలకు 33 దరఖాస్తులు అందినట్లు అధికారి తెలిపారు.

రేపు సీతాఫల్‌మండిలో చేపమందు ప్రసాదం పంపిణీ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ అనిల్‌కుమార్, శంకరరాజ్

బౌద్ధనగర్ జూన్6 (ఆంధ్రజ్యోతి): మృగశిర కార్తె(మార్గం) పురస్కరించుకుని ఆదివారం సీతాఫల్‌మండి సురేష్ థియేటర్ సమీపంలో శ్రీగిరి జ్యోతిష్యాలయం ఆధ్వర్యంలో చేపమందును ఉచితంగా పంపిణీ చేయనున్నారు. శుక్రవారం రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, శ్రీగిరి ఆయుర్వేద ఫార్మసీ నిపుణుడు ఎస్‌పీ శంకరరాజ్ ముఖియా చేపమందు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆదివారం ఉదయం 9గంటలకు కార్యక్రమాన్ని అనిల్‌కుమార్‌యాదవ్, సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ, నామాలగుండు కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ ప్రకాశరావు ప్రారంభిస్తారని ముఖియా తెలిపారు.



మసీద్‌కమిటీ సభ్యులకు గార్బేజ్ కవర్స్‌ను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సామల హేమ తదితరులు

మసీదులకు గార్బేజ్ కవర్స్ పంపిణీ

బౌద్ధనగర్, జూన్6 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పర్వదినం పురస్కరించుకుని సీతాఫల్‌మండి డివిజన్‌లో పరిశుభ్రత ఉండేందుకు స్వచ్ఛతను కాపాడేందుకు శుక్రవారం స్థానిక కార్పొరేటర్ సామల హేమ మసీదు కమిటీ సభ్యులకు గార్బేజ్ కవర్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జాకీర్, జహంగీర్, మేడిశెట్టి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధనగర్‌లో..



బౌద్ధనగర్‌లో మసీదులకు గార్బేజ్ కవర్లను పంపిణీ చేస్తున్న స్థానిక కార్పొరేటర్ కంది్శైలజ, వారాసిగూడ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్, బెజ్జంకి రాజేష్, బాబా తదితరులు.



క్యాంపు కార్యాలయ ఆవరణలో..

తార్నాక, జూన్6 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పర్వదినం రోజున జంతు వ్యర్థాలను చుట్టు పక్క పరిసరాల్లో వేయకుండా జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్ రెడ్డి శుక్రవారం తార్నాకలోని తన క్యాంపు కార్యాలయం ఆవరణలో ముస్లీం సోదరులకు పాలిథిన్ కవర్లను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ కొలను లక్ష్మి

హనుమాన్ ఆలయంలో పూజలు

బేగంపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ హనుమాన్ ఆలయంలో కార్పొరేటర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్పొరేటర్ కొలను లక్ష్మి పుట్టిన రోజు వేడుకలను శుక్రవారం కార్యకర్తల సమక్షంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు.

బీజేపీ పటిష్టతకు కృషి: నర్సింగ్ రావు

మారేడుపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ పదవిని దక్కించుకోవడానికి తమ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు పోటీ పడుతున్నారని మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ కో కన్వీనర్ జె.వి.నర్సింగ్ రావు అన్నారు. ఇందులో భాగంగా కంటోన్మెంట్ బోర్డు ఐదో వార్డుకు సంబంధించిన 29 బూత్ స్థాయి నూతన కమిటీలను మహాకాళి జిల్లా అధ్యక్షుడు భరత్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. శుక్రవారం మహేంద్రహిల్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐదో వార్డు ఇన్‌చార్జి హోదాలో నర్సింగ్ రావు పాల్గొని మాట్లాడారు. బీజేపీ బలోపేతానికి నాయకులు క్షేత్రస్థాయిలో కృషిచేస్తారన్నారు. పార్టీ పదవులు కంటోన్మెంట్ నుంచి దక్కించుకోవడానికి ఏడు మంది సీనియర్ బీజేపీ నాయకులతో పాటు నలుగురు యూత్ నాయకులు కంటోన్మెంట్ నామినేటెడ్ పదవి ఆశిస్తున్నట్లు ఆయన తెలిపారు.

చెరువుల సుందరీకరణ జరిగేనా?

- రామన్నకుంట, తిరుమలగిరి చెరువులకు మోక్షం లభించేనా?
- సీఎం సానుకూలతతో చిగురిస్తున్న ఆశలు



హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజినీర్ రవీందర్, కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్‌తో సమన్వయ సమావేశం జరుపుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

సికింద్రాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని రామన్నకుంట, తిరుమలగిరి చెరువుల సుందరీకరణ జరిగేనా? కాలుష్య సమస్య నుంచి ప్రజలు గట్టెక్కేనా? ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించే రీతిలో ఈ చెరువులు రూపొందేనా? ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవతో అటు హెచ్‌ఎండీఏ, ఇటు సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు విభాగాలతో స్థానిక శాసనసభ్యుడు ఎన్. శ్రీగణేష్ సమన్వయ సమావేశం ఏర్పాటు చేయడంతో ఈ రెండు చెరువుల సుందరీకరణపై ఆశలు చిగురిస్తున్నాయి. బోయినపల్లిలోని రామన్నకుంట చెరువు సుందరీకరణ చర్యలు చేపట్టడం ద్వారా చుట్టు పక్క కాలనీలు, బస్తీలకు వరద ముంపు సమస్య కూడా తీరనుంది. ఇక తిరుమలగిరి చెరువు సుందరీకరణ జరిగితే పలు కాలనీల ప్రజలకు కంపు, దుర్వాసల నుంచి విముక్తి కలగనుంది.

బోయినపల్లిలోని రామన్నకుంట చెరువు వలన ప్రతీ ఏడాది వర్షా కాలంలో పలు కాలనీలు, బస్తీల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతుంటారు. ఎగువ భాగాన నుంచే కూకట్‌పల్లి మున్సిపల్ పరిధిలోని పాతబోయినపల్లి ఏరియాల నుంచి అటు వర్షపునీరు, ఇటు మురుగునీరు రామన్నకుంట చెరువులో చేరుతోంది. దాంతో కుండపోత వర్షాలు కురిసినప్పుడు, ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు పెరిగినప్పుడు చుట్టుపక్కల కాలనీలు, బస్తీలు వరద ముంపునకు గురవుతుంటాయి. గంటల తరబడి వర్షపునీరు నిలిచి పోతుండడంతో ప్రజలు చాలా సేపు ఇళ్లకే పరిమితం కావలసిన పరిస్థితి ఏర్పడుతోంది. అందుకే ఎన్నో ఏళ్లుగా రామన్నకుంట చెరువు ప్రక్షాళన, సుందరీకరణ పనులు చేపట్టాలని ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు భావిస్తున్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం, కంటోన్మెంట్ బోర్డు ప్రత్యేక నిధులు కేటాయించడంతో కొంతమేరకు పనులు జరిగాయి. గతం తో పోలిస్తే వరద ముంపు సమస్య కూడా తగ్గింది. అయితే ఈ సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదని, సుందరీకరణ పనులు కూడా చేపట్టాలంటూ ఎమ్మెల్యే రామన్నకుంట చెరువు ప్రక్షాళన, సుందరీకరణ అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సానుకూలత వ్యక్తం చేశారు. అలాగే తిరుమలగిరి చెరువు సుందరీకరణ పనులకు సంబంధించిన ప్రతిపాదనలు చాలా కాలంగా హెచ్‌ఎండీఏ పరిశీలనలో ఉన్నాయి.

కార్యాచరణ ప్రణాళికపై చర్చలు

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు గతంలో రూ.2కోట్ల 90లక్షలతో చేపట్టిన పనుల వలన వరద ముంపు సమస్య పాక్షికంగా పరిష్కారమైంది. అందుకే ఎమ్మెల్యే తిరుమలగిరి చెరువు అంశాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లడం, ఆయన సానుకూలత వ్యక్తం చేయడం జరిగింది. దాంతో తాజాగా శుక్రవారం హెచ్‌ఎండీఏ, కంటోన్మెం ట్ బోర్డు ఉన్నతాధికారులతో శ్రీగణేష్ ప్రత్యేక సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. కంటోన్మెంట్ బోర్డు సీఈఓ కార్యాలయంలో హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజినీర్ రవీంద్ర, సికింద్రాబాద్ కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్‌లతో శ్రీగణేష్ కూలంకషంగా చర్చించారు. ఈ రెండు చెరువుల సుందరీకరణ పనులు చేపట్టడానికి కావలసిన నిధులు, రూపొందించవలసిన కార్యాచరణ ప్రణాళిక, చేపట్టవలసిన చర్యలపై చర్చించారు. వీటి సుందరీకరణ కోసం ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని, టెండర్లు ఆహ్వానించడానికి కూడా సిద్ధంగా ఉందని, అయితే కంటోన్మెంట్ బోర్డు నుంచి ఎన్‌ఓసీ రావలసి ఉందని ఎమ్మెల్యే తెలిపారు. కంటోన్మెంట్ అభివృద్ధిపై ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నందున త్వరలోనే ఈ రెండు చెరువుల సుందరీకరణ పనులు ప్రారంభం కాగలవని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా హెచ్‌ఎండీఏ, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఉన్నతాధికారుల సమన్వయ సమావేశం జరగడంతో ఈ రెండు చెరువుల అభివృద్ధి, సుందరీకరణ పనులకు మోక్షం లభిస్తుందని పలువురు ఆశిస్తున్నారు.

స్కాలర్‌షిప్‌కు రాజ్‌భవన్ స్కూల్ విద్యార్థుల ఎంపిక



రాజ్‌భవన్ స్కూల్ విద్యార్థులతో ఉపాధ్యాయులు

బేగంపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రతీ సంవత్సరం నిర్వహించే నేషనల్ మీన్స్ కం మెరిట్ ఉపకారవేతనాలకు (ఎన్.ఎంఎంఎస్) రాజ్‌భవన్ స్కూల్ నుంచి అత్యధికంగా 16 మంది విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ఎన్ఎంఎంఎస్ ఇన్‌చార్జీ ఎస్.సురేందర్ తెలిపారు. ప్రతీ సంవత్సరం తమ పాఠశాల నుంచి పలువురు విద్యార్థులు ఈ మెరిట్ స్కాలర్‌షిప్ పొందుతున్నారు. దీనికి విద్యార్థికి ఏడాదికి రూ.12 వేల చొప్పున 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం ఉపకార వేతనాలను ఇవ్వనున్నారన్నారు. ఈ పరీక్షను ప్రభుత్వ పాఠశాలలో చదివే 8వ తరగతి విద్యార్థులకు ఏటా నిర్వహిస్తుంటారు. నగర వ్యాప్తంగా మొత్తం 146 మంది విద్యార్థుల ఎంపిక కాగా అందులో రాజ్‌భవన్ పాఠశాల విద్యార్థులు 16 మంది ఎంపికవడం గర్వకారణమని సురేందర్ తెలిపారు. ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో రాజ్‌భవన్ స్కూల్ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులను హెచ్‌ఎం వికారుద్దీన్, ఇన్‌చార్జీ హెచ్‌ఎం గోపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.

రూ. 2. 5 లక్షలు పలికిన మేకపోతు



బక్రీద్ సందర్భంగా మేకపొట్టేలు వేలం పాటను ప్రారంభిస్తున్న జంపన ప్రతాప్‌తో షకీబ్

బోయినపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : బక్రీద్ సందర్భంగా మేకపోతు, గొర్రెలను బోయినపల్లిలోని పెన్షన్ లైన్‌లో వేలం వేస్తుంటారు. అందులో ఒకటి కర్ణాటక జాతికి చెందిన అంటెల్ మేకపోతు దీని ధర వేలు.. లక్ష.. రూపాయలు అనుకుంటే పొరపాటే. ఈ అంటెల్ మేకపోతు ధర అక్షరాలా రెండున్నర లక్షల రూపాయలు పలికింది. ఇది బోయినపల్లిలోని ఆజ్వా ఎక్సటిక్ ఫామ్‌కు చెందిన మేకపోతు. పంజాబ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఆజ్మీర్, గుంటూరు, బంగ్లాదేశ్, బెంగాల్‌లతో పాటు, పలు ప్రాంతాలకు చెందిన బ్రీడ్ మేకపోతులను ఈ ఫామ్‌లో ప్రతి సంవత్సరం బక్రీద్ పండుగ కోసం ప్రత్యేకంగా పెంచుతున్నట్లు నిర్వాహకుడు షకీబ్ తెలిపారు. ఇవి 120 నుండి 150 కిలోల పైనే బరువు తూగుతాయన్నారు. బక్రీద్‌ను పురస్కరించుకుని బోయినపల్లిలోని పెన్షన్ లైన్ ఫామ్‌లో ఏర్పాటు చేసిన ప్రదర్శన విక్రయాలను శుక్రవారం కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ప్రారంభించారు. అయితే గత సంవత్సరం ఆజ్మీర్ బ్రీడ్ తెల్లవి, నల్ల మేకలకు బాగా డిమాండ్ వచ్చింది.. కానీ ఈసారి కర్ణాటకకు చెందిన అంటెల్ మేకపోతు రెండున్నర లక్షల రూపాయలు పలికింది. అయితే ఈ వేలం పాటను తిలకించడానికి వివిధ జిల్లాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో ముస్లింలు వచ్చి మేకపోతులను, గొర్రెలను కొనుగోలు చేయడం విశేషం. ఈ సందర్భంగా నిర్వాహకుడు షకీబ్ మాట్లాడుతూ ప్రతీ ఏటా బక్రీద్ కోసం ప్రత్యేకంగా వివిధ రకాల మేకపోతు, గొర్రెలను పెంచి పండుగ ముందు రోజు వేలం వేస్తుంటామని తెలిపారు. అంతేకాకుండా ప్రత్యేక మేకపోతులను, గొర్రెలను కోసి కేవలం బిర్యాని వంట చేసి కులమతాలకు అతీతంగా నిరు పేదలకు పంచి పెట్టడం జరుగుతుందని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత: రామకృష్ణ



బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మొక్కను నాటుతున్న జె.రామకృష్ణ

మారేడుపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు 'అమ్మపేరుతో ఒక మొక్క' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ జె.రామకృష్ణ కంటోన్మెంట్ బోర్డు ఐదో వార్డు పరిధిలోని సంజీవయ్య నగర్ వీకర్ సెక్షన్‌లో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణాన్ని రక్షించడం మనందరి బాధ్యత అని అందుకు ప్రతి ఒక్కరం కంకణబద్ధులమై ముందుకు సాగాలని సూచించారు. అలాగే ప్రతీ ఒక్కరు ఐదు మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే పర్యావరణాన్ని రక్షిస్తేనే మానవ జాతి మనుగడ సాధ్యమవుతుందని రామకృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సతీష్, ప్రశాంత్, వీరవర్ధన్, విజయ్, సంతోష్, శశికాంత్, నరేందర్, భూమన్న, కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

టీచర్లు బడిబాటకు..



ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో డీఈఓ రోహిణి, విద్యార్థుల తల్లిదండ్రులు

అడ్డగుట్ట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : చక్కని చదువు చెప్పడానికి ప్రభుత్వ ఉపాధ్యాయులు సిద్ధంగా ఉన్నారని తెలంగాణ ప్రభుత్వ విద్యాశాఖ డీఈఓ రోహిణి అన్నారు. ఈ ఏడాది ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అడ్డగుట్ట ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలోనే మంచి ప్రభుత్వ బడిగా పేరున్న అడ్డగుట్ట ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉందని, డ్రాపౌట్ పిల్లల్ని ప్రభుత్వ టీచర్లే బాధ్యతగా తీసుకొని ఇంటింటికి తిరిగి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ఇన్‌చార్జీ భరద్వాజ్, ప్రైమరీ పాఠశాల ప్రిన్సిపాల్ ఉమాశ్రీ, ఎస్ఎల్ఎఫ్ ప్రతినిధి జయలక్ష్మి, టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దూద్‌బావి పాఠశాలలో...

బౌద్ధనగర్, (ఆంధ్రజ్యోతి): చిలకలగూడ దూద్‌బావి ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన బడిబాటలో విద్యార్థుల తల్లితండ్రులు, పలువురు నాయకులు పాల్గొన్నారు. విద్యార్థుల తల్లితండ్రులకు ప్రధానోపాధ్యాయుడు మెమెంటోలను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపెల్లి శ్రీనివాస్, చైల్డ్ రైట్ ప్రొటెక్షన్ ఫోరమ్ కన్వీనర్ లక్ష్మీనారాయణ, తల్లుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పి.భాగ్య, రామలీల, వరలక్ష్మి, కె.రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కళాసిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

కళాసిగూడలో..

రాంగోపాల్‌పేట్, ఆంధ్రజ్యోతి: బడిబాట కార్యక్రమాన్ని పురస్కరించుకొని కళాసిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో ఆవలమంద కళాసీగూడలో గ్రామ సభ నిర్వహించారు.



దూద్‌బావి స్కూల్‌లో నిర్వహించిన బడిబాటలో విద్యార్థుల తల్లితండ్రులు, ప్రధానోపాధ్యాయుడు



ఓల్డ్ బోయిగూడలోని ఆదయ్య స్మారక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కొమ్మల నారాయణ రెడ్డి, ఉపాధ్యాయులు



గాంధీ ఆస్పత్రి పెయిన్ క్లినిక్‌లో రోగికి శస్త్ర చికిత్స చేస్తున్న వైద్యులు

'గాంధీ'లో విజయవంతంగా ముగ్గురికి శస్త్ర చికిత్స

అడ్డగుట్ట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలంగా నొప్పులతో బాధపడుతున్న ముగ్గురికి పెయిన్ క్లినిక్‌లో శస్త్ర చికిత్సను గాంధీ వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజకుమారి, అనస్థీషియా విభాగాధిపతి మురళీధర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురు రోగులు ఒకరు ప్రొజెన్ షోల్డర్ క్రానిక్ మోకాలి ఆర్థరైటిస్‌లు దీర్ఘకాలంగా నొప్పులతో బాధపడుతుండగా తాము ఇటీవల కొత్తగా ప్రారంభించిన పెయిన్ క్లినిక్‌లో విజయవంతంగా శస్త్ర చికిత్స చేశామని ఇదే శస్త్ర చికిత్స కార్పొరేట్ ఆసత్రుల్లో చేయిస్తే రూ.50 వేలు ఖర్చు అవుతుందని గాంధీలో ఉచితంగా నయా పైసా ఖర్చు లేకుండా శస్త్ర చికిత్స చేశామని తెలిపారు. ఈ ముగ్గురు కొద్ది రోజులు విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుందని వైద్యులు తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో వృద్ధురాలి మృతి



మృతి చెందిన వృద్ధురాలు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : రైల్వే స్టేషన్‌లో ఓ వృద్ధురాలు అనారోగ్యంతో మృతి చెందింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫాం నెంబరు 5లో అండర్ బ్రిడ్జి వద్ద గుర్తుతెలియని 70 ఏళ్ల వృద్ధురాలు అనారోగ్యంతో మరణించింది. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కొరకు గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌ఎంఎస్‌ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాబాజీ



అడ్డగుట్ట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ అనుబంధ సంస్థ రాష్ట్రీయ ముదు సేవా సంఘటన్ సమితి హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అడ్డగుట్టకు చెందిన మంగలిపల్లి సాయి బాబాజీ నియమితులయ్యారు. ఈ సందర్భంగా సాయి బాబాజీ మాట్లాడుతూ ఇటీవల ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఆధ్వర్యంలో ఏర్పాటైన ఆర్ఎంఎస్ఎస్ సంస్థలో తనకు జిల్లా ప్రధాన కార్యదర్శిగా పదవి ఇచ్చిన వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సంస్థ ప్రత్యేక నిరుపేద కుటుంబంలో ఆడ పిల్లలకు పెళ్లిళ్లు చేయలేని తల్లిదండ్రులకు సాయం చేస్తూ, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించేందుకు తోడ్పడుతుందన్నారు. రాష్ట్రంలో నిరుపేదలు ఉండే ప్రాంతాల్లో సాయం కోసం ఈ సంస్థ ప్రతినిధులు ఎప్పటికప్పుడు వివరాలు సేకరించి కేంద్రానికి పంపించే బాధ్యత తీసుకుంటారన్నారు.



గ్రామ సభ నిర్వహిస్తున్న హెచ్ ఎం శ్రీలత

నాణ్యమైన విద్య అందిస్తున్నాం: హెచ్‌ఎం

తిరుమలగిరి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు ఉన్నాయని నాణ్యమైన విద్యను అందిస్తున్నామని పేద వర్గాలకు చెందిన వ్యక్తులు తమ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని బొల్లారం సదర్‌బజార్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శ్రీలత కోరారు. శుక్రవారం బడిబాటలో భాగంగా బొల్లారంలో గ్రామసభను నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ పాఠశాలకు దీటుగా నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. భవనాలు సైతం అత్యాధునిక హంగులతో నిర్మించబడ్డాయని అన్నారు. విద్యార్థుల కోసం అన్ని మౌలిక వసతులు ఉన్నాయని, స్మార్ట్ క్లాసులు కూడా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక బీజేపి నాయకుడు సరల్ గుప్తా, ఉపాధ్యాయులు నిర్మల, సుధ, కాంతేశ్వరి, సరళ తదితరులు ఉన్నారు.



ఆజాద్‌చంద్రశేఖర్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న చిన్నారులు

అడ్డగుట్టలో అమ్మమాట.. అంగన్‌వాడీ బాట

అడ్డగుట్ట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : అమ్మ మాట - అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా ఈనెల 15 నుంచి 20 వరకు జరిగే వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అడ్డగుట్టలోని ఆజాద్ చంద్రశేఖర్‌నగర్ బస్తీలో అంగన్‌వాడి పిల్లలతో ర్యాలీ నిర్వహించారు. చిన్నారులను క్రమం తప్పకుండా అంగన్‌వాడి స్కూలుకు పంపించేందుకు తాము ఇంటింటికి వెళ్లి అడ్మిషన్ చేయించుకుంటున్నామని టీచర్ స్వరూప తెలిపారు. ర్యాలీలో అంగన్‌వాడి టీచర్లు భద్రమ్మ, లక్ష్మి, పద్మ, స్వరూప, రేణుక, అనితతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.